# ఆకాశం

సాయంకాలం ఆరు గంటలయింది. ఇంకా ఉపేక్షచేస్తే లాభంలేదు. బొత్తుగా చీకటిపడిపోతుందని సాహసించి బయల్దేరాను. ఉదయం ఆరింటినించి మనసులో ఒకటే ఆరాటంగా వుంది. ఎందుకో తెలీదు. సమస్యలు లేకుండా రోజులు నడవటంలేదు. సాధారణ మానవుడి మేధస్సుకి ఇవి కేవలం కొనితెచ్చిపెట్టుకున్న వెర్రి సమస్యలు. అవును. ఈ జీవితం అంతా అంతే. ఏదో ఘనమని ఆశిస్తాను, దానికోసం వూరికే ఉబలాటపడతాను. కాంక్ష – సాధనకు సాధ్యమయినంత దూరంగా – దూర దూరంగా – పోతుంది.

అందుకనే నేను నలుగురిలో కలవటానికి భయపడతాను. సమష్టిగా పన్లు చెయ్యటానికి జంకుతాను. పరిమిత వాతావరణంలో కొద్ది మంది స్నేహితులతో మెలుగుతాను. మనసు మాత్రం అనంతంగా అంతర్ముఖంగా ఖేదిస్తోనే వుంటుంది. సాధిస్తోనే వుంటుంది. ప్రతి చిన్న విషయానికి బాదిస్తోనే వుంటుంది.

ఉదయం ఏవీ తోచక అట్లా కృష్ణరావుగారి ఇంటికి వెడదామని బయల్దేరాను. హతభాగ్యుణ్ణి, ఇల్లు తాళంపెట్టి ఆయనెటో వుడాయించారు. తిరగాల్సిన సెంటర్లనీ తిరిగాను. కృష్ణరావుగారు దొరకలేదు. పోతే ఆయన ఎక్కడికి వెళ్లివుంటారనేది నా వూహకు అందింది కాదు. ఏమంటే కృష్ణరావుగారు మనసావాచా కర్మణా నియమబద్ధంగా నడుస్తారు. వారు కొన్ని తావుల్లోనే విహరిస్తారు. కొన్ని పేజీలే చదువుతారు. ఉన్నదంతా వాడేసెయ్యరు----పొదుపుగానే వుంటారు. సాధారణంగా ఆయన ఉదయం ఇల్లు వదిలి వెళ్లే అలవాటు లేదు. కాని---- ఈ రోజు ఎంచేతనో నేనూహించుకోలేని చోటికి---- ఎందుకో---- ఎందుకోసరమో వెళ్లారు. అవును, ఇప్పుడే ఇటు వెడుతూండ

గా చూచామని ఛాలమంది చెప్పారు. ఇందరి సహాయంతోనూ నేనాయన్ను కల్సుకోలేక పోయాను. పోతే---- ఈ సాయంత్రం, శనివారం సాయంత్రం కనక---- ఇల్లు కదలబుద్ధికాక అలానే అరింటి దాకా కూర్చున్నానంతే. ఆరు కాగానే బయల్దేరానా, ఇప్పుడొచ్చి కృష్ణరావుగారి ఇంటి ముందే ఆగాను. తాళం అలానే వుంది. కృష్ణరావుగారు కనిపించరా? అలవాటు ప్రకారం అన్ని రోడ్లూ సందులూ గొందులూ తిరిగాను. ప్రత్యేకించి కృష్ణారావుగారికి అలవాటయిన వాతవరణంవేపు తిరిగొచ్చాను, నాకు మనసులో ఎంతగా ఇష్టంలేకపోయినా. అయినా కృష్ణరావుగారు దొరకరు---- ఆయన ఏదో ప్రోగ్రాంలో ఎక్కడికో వెళ్లి వుంటారు. నాలుగు కాయితాలు జేబులో దోపుకుని ఏ చెట్టు నీడనో, పుట్టమాటునో కూచుని రేడియో కో నాటికో, పత్రికకో కథో, సినిమాకో పాటో రాస్తూంటారు. ఆయన ఆలోచిస్తున్నట్టు బయటిక్కనిపించరు. ఆయన్ను చూచినా ఆలోచించగలరని మనం అనుకోం. పొరపాట్లు చెయ్యటంలో ఏమీ కించపడని వాళ్లం! కాని---- ఆయన మేధావి. ఇంగ్లీషులో జీనియస్!

నాకు ప్రత్యేకించి ఏమీ పనిలేదు ఆయన్తో. వూరికే ఒకసారి, రోజుకోసారి ఆయన్ను చూస్తే, ఎవరో భక్తుడు దేవదర్శనం చేసుకున్నట్టు ---- నాకదో తృప్తి. అదో మనశ్శాంతి. అదో వికాసం. జీవితాన్ని గురించి తార్కికంగా ఆలోచిస్తో కూర్చున్నాను. మన జీవితాలకు గాలీ, నీరూ ఉనికీ ముఖ్యం అన్నారు కొందరు. ఉనికి అంటే? సర్వం దాన్లోనే వుందికదూ---- భోజనం, నిద్ర, షికార్---- అన్నారు దాసుగారు. అసలు జీవితానికి కావల్సిందంటూ ఏమయినా వుంటుందా? కావల్సిందంటూ ఏమయినా వుంటే అది విధిగా రావల్సిందేగా! మన ప్రయత్నం ఎందుకూ? ఒంటరిగా, మ్లానంగా ఆకాశంవేపు చూస్తున్నాను. ఆకాశం భూమీ కలుస్తాయి, అక్కడే శాంతి కాంతి వికాసాలు గోచరిస్తాయి.

ఆలోచిస్తున్నాను, జీవితాన్ని గురించి తాత్వికంగా ఆలోచిస్తున్నాను. ఎందుకని? ఏ ఆశల కోసం ఏ సిద్ధాంతం కోసం బ్రతుకుతున్నామని? సిద్ధాంతం జీవితాన్ని ఎలా మలిచేస్తుందో వూహిస్తే గుండె బద్దలవుతుంది. ఎక్కడో మోగే గంటల శబ్దం, ఇప్పుడే ఇక్కడ చెవుల్లో దూరి వినిపిస్తుంది. "ఎందుకోసమో ఈ బ్రతుకు----అందుకోనమే ఈమాట!" అన్నాను.

''నువ్వు ఒట్టి యనార్కిష్టువి. నలుగురి మంచీ నీకు తెలీదు సరికదా – నీ మంచి కూడా తెలీదు. జీవితాన్ని గురించి జీవితానికి అతీతంగా ఆలోచిస్తున్నావు. ప్రపంచంలో వుంటూనే ప్రపంచానికి అతీతంగా బతకాలనుకుంటున్నావు. నీ బతుకుని ముళ్లకంచెల్లో పారేస్తున్నావు. నీకు ఏదీ లక్ష్యంలేదు. నిర్లక్ష్యమే నీకు సిద్ధాంతం----నీకు దేన్లోనూ నమ్మకం లేదు. అపనమ్మికే నీకు నమ్మిన గురువు----'' అంటున్నారు కృష్ణారావుగారు. ఆయన మాటల్లో నాకు విశ్వాసం వుంది---- కాని ఇలా వుండటంలోనే నాకు ఆనందం వుంది. ఎవరికోసమో ---- ఎందుకోసరమో – వుంటున్నామనీ, ఎరిగీ ఎరగని అగాధాల్లో పడతారు.

ఆలోచించటం నా జన్మహక్కు! అంతు తెగని సమస్యలు తీసుకుని విసుగూ విరామం లేకుండా ఆలోచిస్తాను. తీర్మానం ఆలోచించను. సిద్ధాంతం కోసం నిలిచివుండను. దారికి అడ్డంగావచ్చి ''రిక్షా కావాలా బాబు'' అని వేధించేవాడి భావ ప్రకటన స్వాతంత్ర్యాన్ని భద్ర పరిచే రాజ్యాంగం నా ఆలోచనలనీ నన్నూ ఒకటిగానే భద్రపరుస్తుంది.

కృష్ణారావుగారు ఈ రోజుల్లా కనిపించలేదు. కనిపించలేదే----అని ఆలోచిస్తున్నాను. కనిపించని లోతుల్లో కుదుపుతున్నాను, భారం పెరిగిన బాధ్యతతో దిగుతున్నాను.

ఆలోచిస్తూనే రేడియో సంగీతం వినటం ఇష్టంలేక---- అటు తూర్పుగా నడుస్తున్నాను. దూరంగా, బహు దూరంగా, జనసంచారం విస్తారంగా తిరగని చోటుకి, కృష్ణరావుగారు ఒంటరిగా కాపురించే తావుకు. ❃

(ఆంధ్ర ప్రభ – సచిత్ర వారపత్రిక)